# ప్రవాహి

కాటూరు
రవీంద్ర త్రివిక్రమ్



'టీ తాగుతావా గణేశం?' అన్నాడు గణేశం దగ్గరికి వస్తూ మిత్రుడు అనంతం. చేతిలోని 'పడంబం' 'గబేళా' లోవడేసి 'పోదాం పద' అన్నాడు పైనున్న కండువాతో స్వేదబిందువులు అద్దుకుంటూ గణేశం.

మళయాళదేశంనుండి బ్రతుకుతెరువు కోసం వచ్చిన నాయర్ తేనీరు కలపటంలో తనకున్న ప్రావీణ్యాన్నంతా చూపుతూ ఆ గ్లాసులోంచి యీ గ్లాసులోకి ఎత్తి పోస్తున్నాడు. మధ్య మధ్య బొంగురు గొంతెత్తి 'రావాలి, రావాలి స్పెషల్ టీ రెడీ' అంటూ కేకలు పెడుతున్నాడు.

'రండి...రండి ... మేస్త్రీగార్లూ! మీ కోసం రెండు గ్లాసుల టీ సిద్ధంగాఉంచాను' అంటూ అల్లంత దూరం నుండి కేక పెట్టాడు వీళ్ళిద్దర్నీ చూస్తూనే. అతని హడావుడికి నవ్వుకుంటూ వెళ్ళి చెరో అరకప్పు అందుకుని అచటే ఉన్న రావి చెట్టుమొదట్లో, చల్లని నీడ సేద దీర్చేచోట నిల్చున్నారు.

ఎండ తీక్షణంగా ఉంది. కూలీలు అల్లోయిపదాలు పాడుతూ రాళ్ళు మోసే వాళ్ళు రాళ్ళు, సున్నం కలిపే వాళ్ళు మున్నారం—యలా ~ ఎవరికి సంబంధించిన పనులలో వారు నిమగ్నమై ఉన్నారు. కొందరు కూలీలు 'నాయర్' దుకాణం ముందు గుమిగూడి సరసాలు, పరాచికాలు ఆడుతూ తేనీరు సేవిస్తున్నారు.

'ఇంకో నెలలో బిడ్డింగ్ పూర్తికావా లంటాడుగంద కంట్రాక్టరు, యీ కొద్దిపాటి కూలిజనంతో ఎలా సాగుద్ది?' అన్నాడు తడిసిన మీసాలు తడుముకుంటూ అనంతం.

ఆఖరిగుక్క త్రాగి మందహాసం చేసాడు గణేశం. 'కంట్రాక్టరు కాంతయ్య అంటే బుర్ర లేనివోడనుకున్నావా? మరి అచ్చులు ఎలా ఆర్జించాడంటావ్? ముందు పునాదులు లెగవాలిగంద? తర్వాత స్తంభాలు. పని ఆకాడికి అందుకునే పాటికల్లా కూలి మూకని కొట్టుకురాడూ?'

అనంతం నిర్లిప్తంగా చప్పరించాడు.

'కాంతయ్యకాడ పనికి ఒచ్చేముందు అనుకున్నా, ఈడనేదో తప్పి తలకెత్తుకో వచ్చని! కూలీలు కావాలి దొరా' అంటే 'ఉన్నోళ్ళతో సద్దుకో' అనే వోడు రేపు మన డబ్బులు మనకి సరిగా యిస్తడంటావా?' సందేహం వెలిబుచ్చాడు.

గణేశం నవ్వేడు. 'అదేంటి అనంతం? మరీ అంత ఘోరంగా మాట్లాడతవు? కాంతయ్య అట్టాసెయ్యడు. పోనీ సేసాడే అనుకో, బాగుపడతడు, అంతేగా? నాయంగా బతికే యుగం దాటి పోయింది అనంతం! మనం కలియుగంలో బతుకుతున్నాం. మన కడుపు కొడితేగాని కాంతయ్య జేబు నిండదు. అందుకే అన్నరు 'దనమూలం ఇదంజగత్' అని! ఏదోరకంగా నాలుగు పిచ్చికలు కూడ గట్టుకోవటం కావాల!'

'ఎందుకు గణేశం, ఆ ఎదవబతుకు? అచ్చాదికారియైన లవణమున్నమె కాని మేలిమిబంగారం తినబోడుగంద? ఎంత సంపాయిత్తేనేం? ఈచెమట మన నెత్తురు లోంచి ఒచ్చిందే గద? దాని విలవ మనకి తెలుసుద్దా, మన కూనలకి తెలుసుద్దా? ఆళ్ళుదాన్ని దుమ్మదులిపెయ్యరూ?'

'ఆళ్ళు ఎపుడో దుమ్ము దులుపు తరుగందా అని, ఆళ్ళకి బవిష్యత్తు లేకుండా సేపి ఆళ్ళనోట్లో దుమ్ము గొట్టటం జరమమెల్లాగవుద్ది?'

'అట్టాంటి మాటలు నేనొప్పను

గణేశం! మా తాత ఎట్టా బతికేండు? మా అయ్య ఎట్టా బతికుండు? నేనెట్టా బతుకుతున్నను? ఆళ్లెవ్వరూ తమ కూనలకి గడించి యిచ్చిందేమీ లేదే! రెక్కలిచ్చారు పనిముట్లిచ్చారు ప్రపంచకం సూపించారు. పనినేర్పి బతకమన్నరు.

నేను నాబిడ్డకి అంతే సేత్తా. దన మదం అడి తలకెక్క కూడదు. కష్టజీవి కావాల. రెక్కలతో డొక్క నింపుకోవాల'

వ్యంగ్యంగా నవ్వేడు గణేశం.

'సరే అనంతం! యిదే మాటమీదుండు. కాలం కలిసొస్తే నేను కంట్రాక్టరు నవుతా! నా కొడుకుని ఇంజనీరు సదివిస్తా. అనాడు నీ కొడుకు నీలాగే మేస్త్రీ! నా కొడుకు అలాంటి మేస్త్రీలు వందలమంది మీద పెత్తనం సేస్తాడు. నాగార్జున సాగరంలాంటి ఆనకట్టలు కడతాడు' అని సవాలు చేసాడు.

నిశ్చల మందహాసం చేసాడు అనంతం. 'గాలిమేడలెక్కాలంటే బలమయిన పునాది అవసరం గణేశం! సరి కానియ్, నీ సరదా ఎందుకు కాదనాలె? బగమంతుడు నీకు మంచి చేయాల' అన్నాడు, నాయర్ టీ దుకాణం కేసి కాళీ గ్లాసుతో అడుగు వేస్తూ.

* * *

సన్నగా తుంపర పడుతోంది.

చేతనున్న కొత్త గొడుగువిప్పి తలకి ఆచ్ఛాదనగా ఉంచుకుని గ్లాస్కో పంచె చివరలు ఎడంచేత్తో కలిపి పట్టుకుని, దర్పం ఒలికే భంగిమలో నిల్చుని, పనులు పురమాయిస్తున్నాడు కంట్రాక్టరు గణేశం.

ఒకనాడు—ఎండనక, వాననక రాళ్లు, సున్నం, యిసుకల మధ్య బ్రతికిన గణేశం, గొడుగు అంటే దాని ఉపయోగం అనవసరమని భావించిన వ్యక్తిలో నాలుగు సంవత్సరాల కాలం నమ్మలేని మార్పులు కూర్చింది. అనంతంతో పంతానికి దిగిన తర్వాత గణేశం ఎవరో కంట్రాక్టరుతో చెయ్యి కలిపాడనీ, ఏతా వాతా బాగానే సంపాయించేడనీ, చిన్నం చితకా కంట్రాక్టులు చేబట్టాడని విన్న అనంతం తన వాదం వాస్తవం కాబోతున్నదా అని ఆశ్చర్యపడ్డాడు.

మొన్ననే ఒకంత లో వే యింతవాడు అంతేయి బుడమేరు వాగు మీద వంతెనకి కంట్రాక్టు తీసుకున్నాడు గణేశం. అంతేకాదు అనంతంని వచ్చి పని చేబట్టమన్నాడు! మిత్రుని కింద పని చేయటానికి అనంతం సిగ్గుపడలేదు. అతని ఔన్నత్యానికి అసూయ చెందలేదు. 'సరే' నని కొడుకు 'నారయ్య'తోబాటు పనిలో కొచ్చాడు.

నారయ్య తండ్రి అంతవాడనిపించుకున్నాడు పనిలో. అతన్ని అంతా 'చిన్న మేస్త్రీ' అని పిలవ నారంభించారు. గణేశం కొడుకు కృష్ణ నారయ్య ఈడువాడే; కాలేజీలో పి. యు. సి. చదువుతున్నాడు. ఇవీ క్లుప్తంగా — మార్పులు!

గణేశం లాల్చీజేబులోంచి బీడీ కట్ట, అగ్గిపెట్టె బైటికితీసి వేళ్ల కున్న రాళ్ల ఉంగరాలు తళ తళమంటుండగా సుతారంగా బీడీ ముట్టించుకున్నాడు. ఆర్థికంగా ఎంతఎత్తుకి ఎదిగినా బీడీలు తాగే పాత అలవాటుమాత్రం మాసిపోలేదతనిలో.

గణేశం రూపంలో మార్పు ఇచ్చింది: ఒక్కదేహం లావెక్కి నునుపు దేలింది. అస్తవ్యస్తంగా ఉండే మీసాలు పోషణతో రూపు దిద్దుకున్నాయి. డబ్బుతో వచ్చే అహం, నిర్లక్ష్యం మొహంలో ఒకమడతగా నిలచాయి.

బీడీ సగం పూర్తిచేసి పారవెయ్యబోతుండగా నారయ్య వచ్చాడు. అంత దూరంనుండే వినయంగా 'నమస్కారం బాబుగారూ' అంటూ చేతులు జోడించాడు.

'ఏరా నారయ్య! ఏంటీ యిషయం?' అన్నాడు నడ్డిమీద చెయ్యి పోటీగపెట్టి.

సమీపానికి వచ్చి విచారంగా తలవంచి 'అయ్యకి ఒంటో బాగలేదు బాబు! డాక్టరుగారు మాదిమందు యివ్వాలన్నారు పైసలకిబ్బందిగఉంది' అన్నాడు. వాడి కళ్లలోంచి రెండు నీటిచుక్కలు బుగ్గమీదకి జారాయి.

గణేశం భ్రుకుటి ముడిపడింది. 'మొన్ననే గందరా పది యిచ్చిందీ?' ఆశ్చర్యం ధ్వనించింది గొంతులో.

'సాల్లేదు బాబూ' చేతులు నులుముకున్నాడు నారయ్య!

'ఊఁ...యిట్టా అయితే అయినట్టే పనులు' అంటూ జేబులో ఉన్ననోట్ల దొంతరలోంచి ఒక పదిరూపాయలకాయితం తీసి చేతిలో పెట్టాడు.

నారయ్య మొహం సంతోషంతో చాటంత అయింది. భద్రంగా దాన్నందుకుని చొక్కా మడతలోపెట్టి 'దండాలు బాబూ' అంటూ చేతులు జోడించి, గణేశం తల తాటించగానే నిష్క్రమించాడు.

'గణేశం' కళ్లలో గర్వం తొణికిసలాడింది. ఛాతీనిండుగ గాలి పీల్చుకుని వేళ్లకొసలతో విలాసంగా మీసాన్ని దువ్వుకున్నాడొకమాటు. మనసులో అనుకున్నాడు...

'అనంతం కొడుకు మళ్లీ మేస్త్రీ! 'వడ్లంబం' చేతపుచ్చుకుని ఎండనక, వాననక కొండరాళ్లు పిండిచేస్తూ, సున్నం కలుపుతూ, కట్టడాలు కట్టడంలో తండ్రిలా జీవితం నెట్టేస్తాడు. కానీ, తనకొడుకు? — కాలేజి చదువులు చదివి ఇంజనీరవుతాడు. నాగార్జున సాగరంలాంటి పెద్ద ఆనకట్టలు నిర్మిస్తాడు. లక్షలు ఆర్జిస్తాడు. వాడిక్రింద బోలెడుమంది మేస్త్రీలు. వాళ్లలో నారయ్య ఒకడు! ఎంతభేధం?! ఒకనాటి కూలీల మేస్త్రీ గణేశమే తనంటే కొండంత ఆశ్చర్యపోతారు జనం! అన్యాయం చేస్తేనేమిటి? 'ధనమూల మిదంజగత్' అన్నారు పెద్దలు. మంచో, చెడ్డో, న్యాయమో, అన్యాయమో — పాపమో, పుణ్యమో — ఆ కాంతయ్యగారి పాపాలకి బాసటగ నిలచి ఆయన లాభంలో వాటా పుచ్చుకున్నాడు! ఆయన క్రింద అష్టభూతిలా చేరి ఆయన గుట్టు దొరకబుచ్చుకుని చప్పున అణిచివేసాడు! ఫలితంగా తానిపుడు పేరుమోసిన కంట్రాక్టరు!! లక్షాధికారి!!!

కాంతయ్య గుండె ఆగి చనిపోవటం కాదు; గుండె బద్దలయి చచ్చిపోయాడన్న విషయం తనొక్కడికే తెలుసు! అందుకు ప్రధానకారణం తన మోసమేనని కూడా ఎరుగును!! అయితే తప్పేమిటి? ఆయన ఎందరికి అన్యాయం చెయ్యలా? ఎంతమంది కడుపుకొట్టలా?

కంట్రాక్టుల్లో డబ్బు మిగుల్చుకునే విధానం—సిమెంటు పాళ్లు తగ్గించడం, కూలీల జీతాలవద్ద కరుగ్గ ఉండటమన్న

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్‌సా
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు!
DOL-327 TEL

వాయిదాల పద్ధతిపై ట్రాన్సిస్టర్

ప్రపంచ ఖ్యాతి పొందిన
"నేషనల్ డీలక్స్"
... బ్యాండ్ ... వరల్డ్
పోర్టబుల్ ట్రాన్సిస్టర్‌ను
... రు. 10/- ...
... పొందండి, ప్రతి గ్రామానికి,
నగరానికి పంపబడును వివరములకు.
Music & Sound (A. S. V. P. W. M-10)
P. B. 1576, Delhi-6.

3 నెలలు ఉచిత బహుమతి

కాశ్మీర్, బెంగుళూర్ ఆర్ట్ సిల్కు చీరెలు సరికొత్త ఆకర్షణీయమైన నమూనాల లోను, రంగులలో ను మూడు గలవు. పెద్ద సైజులలో మాత్రమే లభించును. 1 డీలక్స్ చీర రు. 13-50; 2కి రు. 26, 3కి రు. 37-50; 4కి రు. 47.
రెండు లేక అంతకుపై చీరెలకు ఆర్డరు పంపిన వారికి బ్లౌజు గుడ్డ ఉచితం. మీ ఆర్డరును పోస్టు పార్శిల్ ద్వారా పంపెదము.
Atlas Lit Co., (APT-99)
P. B. 1329, Delhi-6.

# పునాది

వ్యాపార రహస్యం కాంతయ్య ద్వారావే తెవకబ్బింది! గ్యారంటే కాలం వరకు, కట్టడం కూలకుండా ఉంటే చాలు! తర్వాత కూలినా యిబ్బందిలేదు. ఇదంతా అన్యాయమేనంటే అసలు న్యాయంగా నడుస్తున్న వాడెవ్వడు?

మనం బతకాలంటే ఇంకొకడు చావాలి! మనం నవ్వాలంటే ఇంకొకడు ఏడవాలి!! జీవితంలోని సారం యింతే.

'అయ్యా!' అన్న పిలుపుకి గణేశం ఊహావాహినికి ఆనకట్ట పడింది. తలతిప్పి చూసాడు కొడుకు!

'ఏంటిరా కృష్ణ?' అన్నాడు మురిపెంగా చూస్తూ.

'నాకో యాభై కావాలే, కాలేజీలో ఫీజు కట్టాలి!' అన్నాడు క్రాపు సరిజేసుకుంటూ. కొడుకు సుందరరూపాన్ని తనివి తీరా చూసుకుంటూ, తక్షణం జేబులోంచి అయిదు పదిరూపాయల కాయితాలు చేతిలో పెట్టి 'సాలుద్దీ యింకో పది యివ్వనా?' అన్నాడు.

'వస్తే యియ్యిలేఅయ్యా' అన్నాడు, ఆధునికుల్లో తిరిగినా భాషకి పదునురాని కృష్ణ.

'ఇంద' అంటూ మరో కాయితం యిచ్చాడు.

నెలకి రెండుమూట్లు కృష్ణ, 'కాలేజీ ఫీజు' పేరుతో అలా డబ్బులు వసూలు చేయటం స్నేహితులలో సరదా చేయడానికేనన్న సత్యం అల్పంగా చదువుకున్న గణేశానికి తెలియదు! పైగా 'అబ్బో! ఎంత పెద్ద సదువు కాపోతే యింతఫీజు' అనుకుంటూ ఆశ్చర్యపోవటమే అతని వంతు.

తనక్కావలసిన డబ్బు ముట్టగానే కృష్ణ సైకిలెక్కి తుర్రుమన్నాడు.

* * *

మబ్బులు వీడి ఆకాశం నిర్మలంగా ఉంది. సూర్యుడు నభోమండలంలో సాన పట్టిన వజ్రంలా మెరిసి పోతున్నాడు. అంతకు మునుపే ఒక సకాలవర్షం పడింది.

గణేశం ఇనప్పెట్టెముందు కూర్చుని కొడుకు ద్వారా డబ్బు లెఖ్ఖపెట్టించి, వాటిని పొత్తులుగా కట్టి, పెన్సిలుతో ఆ మొత్తాన్ని వేసి యధాప్రకారం యినప్పెట్టిలో పెడుతున్నాడు.

ఎవరిదో దగ్గు వినిపించిందంతలో. కిటికీలోంచి చూసేడు గణేశం. లోతుకు పోయినకళ్ళు, పెరిగిన గడ్డం, బక్కచిక్కిన దేహంతో లోపలికి వస్తున్న అనంతం అగుపించాడు.

'అరేయ్ కృష్ణా, తొందరగా డబ్బులోపల పెట్టు; అనంతం వస్తున్నాడు' అంటూ గబ, గబ డబ్బు సర్దేశాడు.

అనంతం నీరసంగా వచ్చి, గణేశంకి దగ్గరగా కూర్చున్నాడు. గణేశం మొహంలో భయం తొంగి చూసింది. క్షయతో బాధ పడుతున్న మిత్రుడికి అంత సమీపాన ఉండటం క్షేమంకాదని మనసులో గుబులు!

'ఏం అనంతం! ఒంట్లో నిమ్మదిగా ఉందా?' మామూలుగ అడిగేడు.

అనంతం ఊపిరాడని ఒక దగ్గు దగ్గి, 'మూస్తున్నావు గంద? అయిపోయింది గణేశం! ఈ ఆకు ఎండిపోయింది. రాలి పోటమే మిగిలింది...' అన్నాడు విరక్తిగా.

'అదేంటి, అనంతం? ఈ కాస్త జబ్బుకే అంత అదయిర్యం పడితే ఎట్టా? నీ కొడుకు శ్రద్ధగా మందిప్పిస్తున్నాడు గంద?' అన్నాడు ఆసక్తి వెలిబుచ్చే ముఖ విన్యాసంతో.

'ఆఁ...యిప్పిస్తున్నాడు. ఆడి సంపాదనంతా యీ మాయదారి రోగానికే సరి పోతుంది. అప్పటికీ దేముడల్లే నువ్వు ఆదుకుంటానే ఉన్నావ్' అన్నాడు ప్రశంసగా చూస్తూ.

విచారంగా అన్నాడు గణేశం.

'ఏంటో కరవుగాకపోతే నీతి తప్పని నీకు క్షయరోగం ఏంటి? అంతా పారబ్దం...'

రానున్న దగ్గుని బలవంతాన ఆపుకున్నాడు నోటికి చేతిని అడ్డం పెట్టుకుంటూ. 'ఏమిటో' అన్నట్టు మూగ సౌంజ్ఞ చేసాడు మాట పెగలక.

కృష్ణ మెల్లగా లేచాడు ఎక్కడికో వెళ్ళటానికి. అనంతం అతనికేసి చూసి 'ఏరా అయ్యా! బాగా సదువుతున్నావా? మీ అయ్య నిన్ను ఇంజినీరు సేద్దామనుకుంటున్నాడు! మరి బాగా సదివి పట్టాప పాసు కావాలి...' అన్నాడు దగ్గు కాస్త నెమ్మదించగా,

విరదావాసం కాదు స్వాగ్యమించాడు కృష్ణ.

అనంతం, గణేశం కేసి చూస్తూ 'పునాదికట్టే మేస్త్రీతో సిమెంటుపాళ్ళు తగ్గించమని సెప్పేవంట? అసలే పాళ్ళు తక్కువ గంద? ఆనక వంతెన స్థంభాలకి బలం ఎక్కడుంటది?' అన్నాడు.

గణేశంమొహం అప్రసన్నంగా మారింది.

'ఏం సెయ్యమంటవు అనంతయ్య! సిమెంటు బ్లాకులోగానీ దొరకటం లేదు! గ్రాంటులు యింకా చేతికందలేదయ్యె. ఏదో యిదంగా అనుకున్న టైముకి పూర్తి సెయ్యాలిగంద ?'

'అందుకని అసలుకే మోప్పం సేసుకుంటే ఎట్టా ?'

'అదేం రాదులే అనంతయ్య! నేను ఆలోసన సేసినాను గంద; మనగారంటీ ఏడాది! అందాక నిలబడితే సాలు...'

అనంతయ్య ఆ మాటకి ఆశ్చర్యపోయాడు.

'అయితే మనం కట్టే వంతెన ప్రభుత్వంకోసమా? అది కూలితే నష్టపోయేది ఎవరు ? ప్రజలు కాదూ?'

'అట్టాగని మనం ఆరిపోవాలంటవ్ ? ఏం న్యాయం సెప్పావ్ అనంతయ్య!' అన్నాడు గణేశం ఎకసక్కెంగా.

అనంతయ్య మనసు బాధపడింది.

మెల్లిగా లేచి 'సరిలే వస్తా! నాదేముంది?—నీ కింద మేస్త్రీని. ఎట్టా సెబితే అట్టా సెయ్యాల్సిన వోడిని. ప్రశ్నించే అధికారం నాకేడది ?' అంటూ తల ఒంచుకు వెళ్ళిపోయాడు మిత్రుని పరివర్తనని మనసుల్లో గర్హించుకుంటూ.

గణేశం నిర్లక్ష్యంగా నవ్వుకున్నాడు.

* * *

వానాకాలం వచ్చిందంటే మేఘాల హడా విడికి హద్దు, పద్దు ఉండదు. చిటికెలో ప్రత్యక్షమౌతాయి. పగలే రాత్రనిపించేట్లు ఆవరిస్తాయి. ఇప్పుడో, కాస్సేపట్లోనో బ్రహ్మాండమైన వర్షం వస్తుందనగా






కేదికలు; పరుగులు పెట్టుకుంటూ వచ్చి; రొప్పుతో సతమతవౌతూ, గణేశం కాళ్లముందు కూలబడి బావురుమన్నాడు నారయ్య.

వాడి అకస్మాత్తు ఆగమనం, ఆపుకోలేని దుఃఖం చూసిన గణేశం కంగారుగా 'ఏందిరా ? ఎందుకట్ట ఏడుస్తావు ?' అన్నాడు పెద్ద గొంతుతో.

'మా అయ్య సచ్చిపోయిండు బాబూ' అంటూ మరో పెద్ద శోకం పెట్టాడు నారయ్య. గణేశం కళ్లు చీకట్లు కమ్మాయి. 'ఏంది? నిన్న తనకాడికి వచ్చి ఊసులాడిన మనిసి సచ్చిపోయాడా ? సావు యింత ఘోరవా?' అతని కళ్లు చెమ్మగిల్లాయి. స్థితిగతుల మాటెలా ఉన్నా అనంతం తన మిత్రుడు. ఆత్మీయుడు. శ్రేయోభిలాషి. ఋజువర్తనుడు. అలాంటి వ్యక్తి మరి లేడు! లేడా ? ఎలా ?

తర్జన భర్జనలు పడుతున్న గణేశం [illegible] 'మీరు రండి బాబూ! నాకెలాగా కొత్త ...' అంటూ [illegible] అయిదు [illegible] 'మీ మావ [illegible] నేను ఎనక వస్తున్నా.

కావల్సినవన్నీ తెప్పించమను' అన్నాడు.

నారయ్య ఎంతో ఆశాభంగం చెందాడు. ఈ ఆపద సమయంలోనన్నా హెచ్చు తగ్గుల తారతమ్యం మరిచి, తనతో వచ్చి తల్లికి ధైర్యం చెబుతాడని ఆశించిన ఆత్మీయుడు, ఎంత ధనికుడైతే మాత్రం పరాయివాడి లాగ డబ్బు చేతిలో పెట్టి సాగనంపుతాడా? వాడి హృదయం ఆక్రోసించింది.

బాధని బలవంతంగా దిగమింగి 'మంచిది బాబూ ! వస్తా...' అంటూ నిష్క్రమించాడు. గణేశం నిస్సహాయంగా నిలబడి పోయాడు. అతన్ని రెండు సమస్యలు వేధిస్తున్నాయి.

ఒకటి – నిన్నరాత్రి కురిసిన వర్షానికి వంతెన స్తంభాలు పెళ్లలూడి పోయాయట. 'బీము' బీటలు యిచ్చినట్లుకూడ తెలిసింది ! అంటే రెండులక్షలు నష్టం! వంతెన కూలాలంటే మరో 'గాలివాన' చాలు !

రెండు – కాలేజి విద్యార్థినిమీద అత్యాచారం చేసినందుకుగాను కొడుకుని పోలీసులు 'లాకప్'లో పెట్టారు.




రెండూ రెండు దెబ్బలు ! రెండింటి మీద ఆకాశం ఎత్తున ఆశలు పెట్టుకున్నాడు. వంతెనపని వజావుగా పూర్తయితే అన్ని ఖర్చులూ పోగా, అరలక్ష లాభం ! కొడుకు పి. యు. సి. ఫస్టు క్లాసులో పాసయితే ఇంజినీరింగ్‌లో ప్రవేశ పెట్టేవాడు !!

కానీ, రెండూ గాలిమేడ లయ్యాయి ! అనంతం అన్నట్లు వాటి పునాది గట్టిగా ఉంటే నిలబడి ఉండేవేమో ! తను చెయ్యి తిరిగిన మేస్త్రీ ! కానీ సూక్ష్మ సత్యం మరచిన మూఢుడు !

కొడుకుకి శిక్ష ఖాయం అని పేరు మోసిన లాయరే చెప్పాడు. వంతెన జ్యోతిష్యం తను చెప్పగలడు ! దాని జీవితం ఒక్క గాలివాన !! దానితో ఆఖరు !

గణేశం తల పట్టుకున్నాడు.

తనసలు ఏమవుదామనుకున్నాడు ? అనంతంతో పంతంపట్టి, మాట నెగ్గించుకోవడం కోసం పెడదారులు తొక్కాడు ? అబద్ధం! అంతర్గతంగా ఆ ఆలోచన తన కున్నదే !!

ఆచరణలో చూపటానికి ఆనాటి సంభాషణ మరి కాస్త దోహదంచేసి ఉండవచ్చు !

గణేశం తల బరువెక్కినట్లనిపించింది. అసలు కొడుకుదగ్గిరి కెళదామని చెప్పుల్లో కాళ్లు పెట్టాడు. అంతలో చావుకబురుతో నారయ్య వచ్చాడు !

ఇప్పుడు ఒకమాటు వంతెనచూసిరావటం మంచిదనిపిస్తోంది. ఆకాశంకేసి చూసాడు. గాలి యీలలు వేస్తోంది, చెట్లు వందుల్లోంచి దూరుతో !

చల్లటిగాలి శరీరాన్ని గడ్డకట్టిస్తోంది.

వెళ్లాలి. ఎక్కడికో వెళ్లాలి! ఇలా నిలబడటం తనవల్లకాదు. ఈ ఆలోచనలు; వీటి బరువు తను భరించలేడు. గణేశం చక, చక, నడిచాడు. అతని అడుగులు అనంతం పూరిగుడిసె వైపు దారితీసాయి.